సాక్షి
వరంగల్

శుక్రవారం | 27 | జనవరి | 2023



అసౌకర్యం కలగకుండా...

మేడారం మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు.

- 8లో▸



ఆర్‌ఎంపీలకు అండగా ఉంటా..

ఆర్‌ఎంపీ వైద్యులకు అండగా ఉంటానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు.

- 9లో▸

గరిష్టం/కనిష్టం
33^0/18^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పొదుపు పథకాల్లో భాగస్వాములు కావాలి



నర్సంపేట: తపాలా శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు పొదుపు పథకాల్లో భాగస్వాములు కావాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ అన్నారు. పట్టణంలోని పోస్టాఫీస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయన్నారు. భారత ప్రభుత్వం ప్రతీ మూడు నెలలకోసారి పోస్టాఫీస్ వడ్డీ రేట్లు సవరిస్తుందన్నారు. అందులో భాగంగా 2023, జనవరి ఒకటో తేదీ నుంచి వడ్డీ రేట్లను భారీగా పెంచిందని, వాటికి సంబంధించిన వివిధ స్కీముల వడ్డీ రేట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం డి.రాజేందర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీటీల సర్వీస్ బుక్ పరిశీలన

కాళోజీ సెంటర్: జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కొరకు సీనియారిటీ లిస్టులోని కటాఫ్ ఆధారంగా శుక్రవారం వారి సర్వీస్ బుక్ పరిశీలన చేయనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. కటాఫ్ డేట్స్‌లోని ఉపాధ్యాయులు తమ సర్వీస్ బుక్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు డీఈఓ కార్యాలయానికి రావాలని ఆమె పేర్కొన్నారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలు



వరంగల్ అర్బన్: 74వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య జాతీయ జెండా ఎగురవేశారు. వేడుకలకు మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ మహానగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు. దేశ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమాన అవకాశాల్ని అందించేందుకు పునరంకితం కావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, కావేటి కవిత, ముష్కమల్ల అరుణ, బస్వరాజు శిరీష, పల్లం పద్మ, జన్ను షీబారాణి, గుండు చందన, సురేష్ జోషి, దేవరకొండ విజయలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ ఉర్ రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, జోనా, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ టౌన్‌హాల్‌పై మువ్వన్నెల జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య, వింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములకు 'ప్రశంస'లు



నృత్యం చేసిన విద్యార్థినులకు ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్ గోపి

- వివరాలు 8లో▸

విద్యార్థినికి అద్భుత అవకాశం

బాధ్యతాయుతంగా పని చేయండి

చాలెంజ్‌గా తీసుకుని నిరంతర విద్యుత్ సరఫరా

- వివరాలు 10లో▸

మువ్వన్నెల మురిపెం..



కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు



కొండూరులో విద్యార్థులతో మంత్రి దయాకర్‌రావు



- జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ గోపి

కరీమాబాద్: మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. దేశభక్తి గీతాలు.. సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే పాటలకు విద్యార్థినులు నర్తించిన తీరు కనువిందు చేసింది. వరంగల్ కలెక్టరేట్‌లో గురువారం 74వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ గోపి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఇదిలా ఉండగా.. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శంభునిపేట మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, గీసుకొండ కేజీబీవీ, చింతల్ వీనస్ పాఠశాలల విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతీయ జెండా మాదిరిగా మూడు రంగుల డ్రెస్సులు ధరించి విద్యార్థినులు జాతీయ గీతానికి నృత్యాలు చేశారు. దేశభక్తికి సంబంధించిన పాటలకు డ్యాన్స్‌లు చేశారు. భారతమాత వేషధారణతో జాతీయ పతాకాన్ని చేబూని సంస్కృతీ సాంప్రదాయాలను తెలియజేస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, డీసీపీ వెంకటలక్ష్మి, ఆర్డీఓ మహేందర్ జీ, ఆయా శాఖల ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

జెడ్పీలో పతాకావిష్కరణ

వరంగల్ రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ సాహితీ మిత్ర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జెడ్పీటీసీ సభ్యులు పత్తినాయక్, సుమలత, సుదర్శన్‌రెడ్డి, గరిగె కల్పన పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ గోపి

కమిషనరేట్‌లో గణతంత్ర వేడుకలు



సెల్యూట్ చేస్తున్న సీపీ రంగనాథ్, అధికారులు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బంది, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు వెంకటలక్ష్మి, అశోక్‌కుమార్, అదనపు డీసీపీలు వైభవ్ గైక్వాడ్, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి

- ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కరుణాకర్‌రెడ్డి

ఎంజీఎం: రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి కరుణాకర్ రెడ్డి తెలిపారు. రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా గురువారం యూనివర్సిటీలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ టి.వెంకటేశ్వర్‌రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మల్లేశ్వర్, డిప్యూటీ రిజిస్ట్రార్లు సుధాకర్, హేమంత్, రామానుజం, ఫైనాన్స్ ఆఫీసర్ సురేఖ, పీఆర్‌ఓ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు 163.. బదిలీలు 459

- ఉపాధ్యాయుల లెక్క తేల్చిన జిల్లా విద్యాశాఖ
- ఆయా వివరాలన్నీ నేడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం
- 28 నుంచి 30వ తేదీ వరకు ఆప్షన్లకు అవకాశం
- ఫిబ్రవరి 8 వరకు దశలవారీగా స్క్రూటీ్ని



సాక్షి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 163 మంది ఉపాధ్యాయులు పదోన్నతులకు సిద్ధంగా ఉన్నట్లు లెక్క తేల్చారు. వీరిలో 125 మంది అన్ రిజర్వ్‌డ్ విభాగంలో ఉండగా, ఎస్సీ కేటగిరీలో 24 మంది, ఎస్టీలో ఆరు, పీహెచ్‌సీ కేటగిరీలో 8 మంది ఉన్నట్లు లెక్క తేలింది. అయితే ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా, పదోన్నతి కోసం ఖాళీల జాబితాను కేటగిరీలవారీగా శుక్రవారం ఆన్‌లైన్‌లో విద్యాశాఖ అధికారులు నిక్షిప్తం చేయనున్నారు. వీటి ఆధారంగా 28 నుంచి 30వ తేదీ వరకు బదిలీల కోసం తమకు కావాల్సిన ఆప్షన్‌ను ఉపాధ్యాయులు ఎంచుకుంటారు. అయితే ఆన్‌లైన్‌లో సమర్పించిన కాపీలను డౌన్‌లోడ్ చేసి.. హార్డ్ కాపీలను హైస్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులైతే ఆ పాఠశాల హెచ్‌ఎంకు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులైతే ఎంఈఓ, లోకల్‌బాడీ ఉపాధ్యాయులైతే స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు, ప్రధానోపాధ్యాయులైతే డీఈఓకు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీలోపు సమర్పించాలి. ఈ కాపీలపై ఫిబ్రవరి 3 నుంచి 6వ తేదీ వరకు పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత దంపతులైన ఉపాధ్యాయులకు 10 పాయింట్లు, సర్వీసు ఆధారంగా 10 పాయింట్లు, యూనియన్ల వారికి 10 పాయింట్లు.. ఇలా వివిధ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ప్రొవిజన్ సీనియారిటీ జాబితా బదిలీలను 7 నుంచి 8వ తేదీలోపు పరిశీలిస్తారు. ఇదే సమయంలో టీచర్లకు ప్రొవిజన్ లిస్ట్‌పై ఏమైనా అభ్యంతరాలుంటే ఇవ్వొచ్చు. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఉండనుంది.

బదిలీల సంఖ్య పెరగొచ్చు..

అన్ని పరిశీలించిన తర్వాత పదోన్నతులు పొందే ఉపాధ్యాయుల సంఖ్య 163గా తేలింది. ఒకే పాఠశాలలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీసు నిండిన ఇతర కేటగిరీ ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి. దీని ప్రకారం అన్ని కేటగిరీలు కలిపి బదిలీ అయ్యేవారి సంఖ్య జిల్లాలో 459గా ఉంది. వీరిలో మూడేళ్లలోపు ఉద్యోగ విరమణ పొందే వారికి మినహాయింపు లభించనుంది. ఒకవేళ బదిలీకి మరికొందరు దరఖాస్తు చేసుకుంటే ఇంకా పెరిగే అవకాశం ఉందని డీఈఓ డి.వాసంతి తెలిపారు.

పోలీస్‌శాఖలో బదిలీల కుదుపు

ఉమ్మడి వరంగల్‌లో పెద్ద ఎత్తున అధికారుల బదిలీ

- ములుగు ఎస్పీ సంగ్రామ్ సింగ్ బదిలీ.. ఆయన స్థానంలో గౌస్ ఆలం
- కమిషనరేట్ పరిధిలో పలువురికి స్థానచలనం.. పెద్దపల్లి డీసీపీగా గైక్వాడ్ రఘునాథ్
- పీటీసీ ప్రిన్సిపాల్‌గా సతీష్.. మామునూరు కమాండెంట్‌గా సింధుశర్మ
- వరంగల్ డీసీపీలుగా పుల్లా కరుణాకర్, ఎం.ఏ.భారీలు
- మొత్తం 14 మందికి స్థానచలనం



గైక్వాడ్



కె.వెంకటలక్ష్మి

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో పోలీస్ ఉన్నతాధికారుల మూకుమ్మడి బదిలీలు చర్చనీయాంశంగా మారాయి. చాలాకాలం తర్వాత ఎస్పీ(ఐపీఎస్, నాన్‌కేడర్), అడిషనల్ ఎస్పీ(ఐపీఎస్, నాన్ ఐపీఎస్), గ్రూప్-1 తదితర స్థాయిల అధికారులకు స్థానచలనం కలిగింది. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత పలుమార్లు బదిలీలు జరిగినా పెద్దఎత్తున ఎస్పీలు, డీసీపీలను మార్చడం ఇదే తొలిసారి. ఒకేచోట నాలుగైదేళ్ల వరకు పనిచేసిన వారితోపాటు వివిధ విభాగాల్లో పనిచేసిన వారికి కూడా స్థానచలనం కలిగించారు. ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూకుమ్మడి బదిలీలు జరిగాయన్న చర్చ ఉంది. కాగా.. బుధవారం అర్ధరాత్రి వెలువడిన ఈ బదిలీ ఉత్తర్వులలో ఐపీఎస్ అధికారులు సంగ్రామ్ సింగ్ పాటిల్, అశోక్‌కుమార్, గౌస్ ఆలం, వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌ల తోపాటు పలువురికి బదిలీలు అయ్యాయి. అయితే బదిలీ అయిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పుల్లా శోభన్‌కుమార్‌ల స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అధికారుల బదిలీలు, పోస్టింగుల వివరాలు..

- 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ములుగు ఎస్పీ పాటిల్ సంగ్రామ్‌సింగ్‌ను బదిలీ చేస్తూ హైదరాబాద్‌లోని విజిలెన్స్ విభాగానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(విజిలెన్స్)గా పోస్టింగ్ ఇచ్చారు.
- సంగ్రామ్‌సింగ్ స్థానంలో ఏటూరునాగారం అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ గౌస్ ఆలంను నియమించారు. ఈయన 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు.
- ఏటూరునాగారం ఏఎస్పీగా గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సిరిశెట్టి సంకీత్‌ను నియమించారు.
- వరంగల్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్), కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను ఇక్కడినుంచి బదిలీ చేస్తూ రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి డీసీపీగా పోస్టింగ్ చ్చారు.
- ములుగు ఏఎస్పీగా ఉన్న కేకన్ సుధీర్ రామ్‌నాథ్ (ఐపీఎస్-2018 బ్యాచ్)ను బదిలీ చేస్తూ రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల డీసీపీగా నియమించారు.
- 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ గ్రేహౌండ్స్ నుంచి డిప్యుటేషన్‌పై ములుగు ఏఎస్పీగా కూడా పనిచేస్తుండగా, బదిలీలలో భాగంగా అక్కడే ఓఎస్‌డీ(ఆఫీసర్-ఆన్-స్పెషల్ డ్యూటీ)గా నియమించారు.
- వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న కె.వెంకటలక్ష్మిని హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ సీఐడీ విభాగంలో ఎస్పీగా నియమించారు.
- వెంకటలక్ష్మి స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్-కేడర్) పుల్లా కరుణాకర్‌ను బదిలీ చేశారు.
- వరంగల్ కమిషనరేట్‌లో ఉండి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్-కేడర్) ఎన్.అశోక్‌కుమార్‌కు హైదరాబాద్ సిటీట్రాఫిక్-2 డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్-కేడర్) ఎం.ఏ.భారీని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించారు.
- వరంగల్ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఉన్న అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పుల్లా శోభన్‌కుమార్‌ను సైబరాబాద్ ఎస్‌ఓటీ-2 అదనపు డీసీపీగా బదిలీ చేశారు.
- వరంగల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజను హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీకి డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పోలీస్ సూపరింటెండెంట్ (నాన్-కేడర్) చోడగిరి సతీష్‌ను నియమించారు.
- వరంగల్ ఇంటెలిజెన్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్-కేడర్) ఆర్.భాస్కర్‌కు వరంగల్ ఇంటెలిజెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పోస్టింగ్ ఇచ్చారు.
- టీఎస్ఎస్‌పీ నాలుగో బెటాలియన్ (మామునూరు) కమాండెంట్ ఇ.శివప్రసాద్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సింధు శర్మను నియమించారు.

భక్తిశ్రద్ధలతో శివుడికి జలాభిషేకం



శివాలయ పునఃప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



శివుడికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

- శివాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు షురూ..

పర్వతగిరి: మండల కేంద్రంలో శివాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా వీధుల్లో ప్రతీ ఇంటికి తిరుగుతూ.. ఊరేగింపు నిర్వహిస్తూ గ్రామస్తులు శివుడికి జలాభిషేకం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ జలాభిషేకం చేశారు. అనంతరం దవీలాల్‌తండాలో కూడా జలాభిషేకం చేశారు. అనంతరం గుట్టపైకి శివుడు, విఘ్నేశ్వరుడి ప్రతిమలను తీసుకెళ్లారు. పర్వతాల గుట్టపై ఉదయం 9 గంటలకు పర్వతాల ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు హోమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్, జెడ్పీటీసీ భానోతు సింగ్‌లాల్, మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, పూజాధికులు బోగోజు రమేశ్, జూలపల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు. కాగా.. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి దయాకర్‌రావు జలాభిషేకం కార్యక్రమాన్ని వీక్షించారు.

ఎమ్మెల్యే అరూరి పరిశీలన

భక్తులకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా అన్నదాన ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరిశీలించారు. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా చేపట్టిన శివలింగ ఊరేగింపులో పాల్గొని.. తర్వాత గుట్టపై ఏర్పాట్లను పరిశీలించారు. పర్వతగిరి బస్టాండ్ నుంచి గుట్టపైకి జీపు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఘనంగా భ్రమరాంబిక అమ్మవారి వార్షికోత్సవం



గర్భగుడిలోని భ్రమరాంబిక అమ్మవారు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి ఉత్తర భాగంలో నిర్మించిన భ్రమరాంబిక ఆలయంలో గురువారం తొమ్మిదో వార్షికోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యములతో విశేష అభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్రపుష్పం, చండీహవన కార్యక్రమాలు ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత రంగయ్య దంపతులు, కుటుంబ సభ్యులు, ఈఓ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి'



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు, కార్యకర్తలు

నర్సంపేట: అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసేంతవరకు పోరాటాలు చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం పిలుపునిచ్చారు. పట్టణంలోని అరవింద, జగదానంద రైస్ మిల్, ఐరన్, కిరాణం, ఫర్టిలైజర్ దుకాణాల్లో పనిచేసే మంద మల్లయ్య కూటుకు చెందిన 42 మంది హమాలీలు గురువారం ఏఐఎఫ్‌టీయూ(న్యూ)లో చేరారు. అనంతరం మంద మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లేశం మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో అసంఘటిత రంగంలో కోట్లాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మెరుగు జనార్దన్, బొల్లెన రమేశ్, ఈరెల్లి రామచందర్, రాములు, ఈశ్వరయ్య, రవి, భూసాని మల్లయ్య, యేసుపతి, సక్క అశోక్, ఏశబోయిన ఐలయ్య, నల్ల సతీష్, లింగయ్య, జెట్టి రాజు, కీసరి రాజు, పరుషబోయిన లింగయ్య, వావిళ్ల రాజు తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కామాంధుడి అరెస్ట్

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కొత్తతండాలో రెండేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన సపావట్ అశోక్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం చిన్నారిని ఊయలలో పడుకోబెట్టి తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా అదే తండాకు చెందిన అశోక్ చిన్నారిపై అత్యాచారయత్నం చేయబోయిన విషయం తెలిసిందే. దీంతో చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు అశోక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సూచిక బోర్డును ఢీకొట్టిన బైక్

● ఒకరికి తీవ్రగాయాలు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం – కమలాపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ నర్సరీ వద్ద గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఎన్నంపెల్లి రాంబాబు బయ్యారంలో వివాహానికి హాజరై తిరిగి ముప్పనపల్లికి వెళ్తున్నాడు. ఏటూరునాగారం నర్సరీ వద్ద బైక్ అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. దీంతో రాంబాబు కుడికాలు విరిగింది. 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన మేకల రవి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేకల రవి కొంతకాలంగా భార్యతో తరుచు గొడవ పడేవాడు. నెల రోజుల క్రితం అతడి భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో వారం క్రితం అత్తగారింటికి వెళ్తానని బంధువుల వద్ద డబ్బు తీసుకొని గ్రామంలో కనిపించడం లేదు. అతడి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తలుపులు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అక్క అర్కా రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మిర్చి రైతు వద్ద నగదు చోరీ

రామన్నపేట : మిర్చి ఏనుమాముల మార్కెట్‌లో విక్రయించి ఇంటికి వెళ్లే క్రమంలో వరంగల్ బస్టాండ్‌లో రైతు వద్ద రూ.45 వేల నగదు చోరీకి గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొరుపోలుకు చెందిన మాతంగి ముత్తయ్య బుధవారం ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి విక్రయించగా రూ.45 వేలు వచ్చాయి. ఇంటికి వెళ్లేందుకు మధ్యాహ్నం వరంగల్ బస్టాండ్‌కు వచ్చి మహబూబాబాద్‌కు వెళ్లే బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి నగదు కాజేశాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపారు.



జిల్లా ఎక్సైజ్ అధికారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ గోపి

ఉత్తములకు ‘ప్రశంస’లు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ గోపి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, డీసీపీ వెంకటలక్ష్మి గురువారం ప్రశంస పత్రాలు, అవార్డులు అందజేశారు. వరంగల్ కలెక్టరేట్‌లోని ప్రత్యేక వేదికపై వీరు అవార్డులు అందుకున్నారు.

– కరీమాబాద్







కలెక్టరేట్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నెక్కొండలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నల్లబెల్లిలో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు



సంగెంలో చిన్నారుల జాతీయ నాయకుల వేషధారణ

అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు

● మేడారం మినీజాతర విధుల్లో 300 మంది కార్మికులు, 150 మంది సిబ్బంది
● ‘సాక్షి’తో ములుగు పంచాయతీ అధికారి వెంకయ్య

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు. గురువారం మేడారంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే మినీ జాతర (మండమెలిగె) ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారనే అంచనాతో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జాతర అనంతరం పోస్ట్ జాతరలో కూడా భక్తులకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతామని పేర్కొన్నారు. మినీ జాతర నేపథ్యంలో ఇప్పటి నుంచే ముందస్తుగా భక్తులు వస్తుండడంతో పది రోజుల క్రితం నుంచే పనులను ప్రారంభించామని వెల్లడించారు.

జాతరకు 300మంది కార్మికులు..

మినీజాతరలో పారిశుద్ధ్య పనుల కోసం 300మంది కార్మికులను ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ వెంకయ్య తెలిపారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ వై జంక్షన్, ఊరట్టం స్తూపం, రెడ్డిగూడెం, మేడారం గ్రామంతో పాటు భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరను సెక్టార్ వారీగా విభజించి ఏయే ప్రాంతాల్లో ఎంత మంది కార్మికులను ఏర్పాటు చేయాలనేది పంచాయతీ అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణకు 150 మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. షిఫ్ట్‌ల వారీగా కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎక్కడా కూడా చెత్తా చెదారం లేకుండా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామన్నారు. బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



మరుగుదొడ్ల మరమ్మతులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకయ్య



రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

షెడ్ల వద్ద ఏర్పాట్లు...

మేడారంలోని ఐదు షెడ్ల వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీపీఓ తెలిపారు. షెడ్ల వద్ద మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వాటికి వాటర్ కనెక్షన్ల మరమ్మతులు చేస్తున్నామన్నారు. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకులను కూడా శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. షెడ్లలో ఫ్యాన్లు, లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు కూడా ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు, చెత్తచెదారం పడేయకుండా సహకరించాలని కోరారు. జిల్లా అధికారుల సూచనలు, సలహాల మేరకు పారిశుద్ధ్య సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

కేసీఆర్ సేవలు దేశానికి అవసరం



తొర్రూరులో జెండా వందనం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలంటే కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 అడుగుల జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగానే పాలన సాగుతుందన్నారు. దేశాన్ని ముందుకు నడిపించే రాజనీతి గల నాయకుడు కేసీఆర్ అని, ఆయన నాయకత్వం దేశానికి అవసరమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, దళితబంధు తదితర పథకాలు విజయవంతంగా అమలవుతుండటంతో దేశ ప్రజల దృష్టి తెలంగాణ వైపు మళ్లిందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో తొర్రూరు మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు శామకూరి ఐలయ్య, ధరావత్ జైసింగ్, చీకటి శ్రీనివాస్, దొంగరి శంకర్, కుర్ర శ్రీనివాస్, జిలుకర సురేందర్, ఆర్డీఓ రమేష్, డీఎస్పీ రఘు, తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పసుమర్తి శాంత, వైస్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గవర్నర్ వ్యవస్థను కించపరిచే విధంగా పనిచేస్తున్న తమిళిసై

పర్వతగిరి: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ భారత రాజ్యాంగ వ్యవస్థను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో పర్వతాల శివాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలచే ఎన్నుకోబడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కించపరిస్తే రాష్ట్ర ప్రజలను కించపరిచినట్లే అవుతుందన్నారు. తెలంగాణ గవర్నర్ కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గవర్నర్ సమాలోచన చేసి గౌరవాన్ని కాపాడుకునే విధంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

మోకుజారి గీత కార్మికుడి మృతి

చిల్పూరు: మోకు జారి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టలో గురువారం జరిగింది. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు కుమారస్వామి(55) కొన్నేళ్ల క్రితం కుటుంబ పోషణ నిమిత్తం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టకు చేరుకున్నాడు. గీత వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి ఒక గెల గీసి మరో గెల వైపు తిరుగుతుండగా మోకు జారింది. దీంతో పైనుంచి కిందివరకు జారడంతో తీవ్రగాయాలై చెట్టుపైనే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే తాటి చెట్టే ఊపిరి తీసేఅంటూ మృతుడి భార్య పుష్పలీల రోదించిన తీరు కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సర్పంచ్‌లు ఏదునూరి రవీందర్, కొంగరి రవి, ఉప సర్పంచ్‌లు కంకటి రాజన్న, బబ్బుల వంశీ, బీఆర్‌ఎస్ నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



మోకుజారి మృతి చెందిన కుమారస్వామి



కుమారస్వామి (ఫైల్)

సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ చమన్‌లోని ఓ ఇంట్లో గురువారం సాయంత్రం సట్టా స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉర్సు కరీమాబాద్‌లోని అంకం శ్రీకాంత్ అనే వ్యక్తి తన ఇంట్లో సట్టా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదేశాలు, ఏసీపీ జితేందర్‌రెడ్డి సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి శ్రీకాంత్ నుంచి రూ.3,520ల నగదు, సెల్‌ఫోను, ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డెబోయిన లవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాటివనంలో పేకాట

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురంలోని తాటివనం పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రియల్టర్లతోపాటు ఆటో డ్రైవర్లు వేర్వేరుగా పేకాట ఆడుతున్నారు. ఈమేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గురువారం దాడులు చేయగా ఆటో డ్రైవర్లు చిక్కగా, రియల్టర్లతో పాటు కొంతమంది ప్రజాప్రతినిధులు పరారైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే పట్టుబడిన వారు ఆటో డ్రైవర్లుగా పోలీసులు చెబుతున్నారు. వారి వద్ద నుంచి రూ.8,090 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోలతోపాటు మరో రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు డ్రా

● నిందితుడి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : ఏటీఎం సెంటర్లలో డబ్బు డ్రా చేసుకునేందుకు వచ్చిన వారికి మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డులు మార్చి నగదు విత్‌డ్రా చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. విజయవాడలోని భవానీపురం ప్రాంతానికి చెందిన అలవుల వెంకటనాగసుధాకర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఏటీఎం సెంటర్లకు వచ్చేవారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కార్డులు మార్చి నగదు డ్రా చేసుకునేవాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ఏటీఎం సెంటర్‌లో డిసెంబర్ 13న కార్డు మార్చి డబ్బు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. సమావేశంలో పీసీలు రుద్రయ్య, బాలరాజు, జావిద్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై విజయరాంకుమార్

పైన చెరుకు.. లోపల బెల్లం

● లారీ సీజ్.. కేసు నమోదు

దంతాలపల్లి: పైన చెరుకు లోపల నల్లబెల్లంతో వెళ్తున్న లారీని సీజ్ చేసినట్లు దంతాలపల్లి ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దంతాలపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కానిస్టేబుళ్లు గణేష్, బగ్గు, వెంకటేశ్వర్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి లారీ డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. లారీలోని మరో వ్యక్తి పారిపోయాడు. దీంతో కానిస్టేబుళ్లు లారీలో తనిఖీ చేయగా పైన చెరుకు లోన 30 బస్తాల నల్లబెల్లం కనిపించింది. దీంతో డ్రైవర్ దుంప వెంకన్న, పారిపోయిన వ్యక్తి ధారావత్ గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



లారీలో తనిఖీ చేస్తున్న లీసులు

చెరువులో పడి ఒకరి మృతి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేట చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. న్యూశాయంపేటకు చెందిన అదే ఉమేష్ ఈనెల 24న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు న్యూశాయంపేట చెరువులో పడి మృతి చెందాడు. గురువారం ఉమేష్ మృతదేహం చెరువులో తేలడంతో బయటకు తీశారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పశువైద్యశాఖ ఏడీ ఆత్మహత్య

● నిజామాబాద్‌లో ఘటన
● పోలీసులకు లభ్యమైన సూసైడ్‌నోట్

హన్మకొండ/ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర పరిధిలోగల సారంగపూర్ డెయిరీఫాంలోని డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డైయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి నిజామాబాద్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దకాసుల శ్రీశైలం(52) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన శ్రీశైలం గత ఏడాది వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఏడీగా బదిలీపై వెళ్లారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆయన హనుమకొండలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందరు మంచిగా ఉండాలని తెలిపారు. తండ్రి మాటల్లో తేడాలు రావడంతో కుమారుడు రవితేజ వెంటనే నిజామాబాద్ వెళ్లాడు. శ్రీశైలం గదికి గడియ ఉండటంతో తలుపులు తొలగించి తెరిచేసరికి ఆయన ఉరివేసుకొని ఉన్నారు. ఏడీ చనిపోయే ముందు సూసైడ్‌నోట్ రాశాడు. అందులో తన చావుకు ఎవరు కారణం కాదని ఉంది. కానీ సూసైడ్ నోట్‌ను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడారా? లేదా ఆర్థిక కారణాలు, ఇతరత్రా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని హనుమకొండకు తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం కుమార్తె వివాహం, డిసెంబర్ 4న పెద్ద కుమారుడి వివాహం జరిపించారు.



శ్రీశైలం (ఫైల్)

తొర్రూరులో విషాదఛాయలు

తొర్రూరు వాసి అయిన పెద్దకాసుల శ్రీశైలం ఆత్మహత్యతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తొర్రూరులో పాఠశాల, ఇంటర్ విద్య పూర్తిచేసిన ఆయన అనంతరం వెటర్నరీ విద్యను అభ్యసించి పశుగణాభివృద్ధి శాఖలో ఏడీ స్థాయికి ఎదిగారు. తొర్రూరుకు ఎప్పుడు వచ్చినా అందరితో కలగలపుగా ఉండేవాడని స్థానికులు పేర్కొన్నారు. ఆయన అకాల మరణంతో స్నేహితులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.